క్లుప్తంగా

ట్రూ లైట్ చర్చిలో సెమీ క్రిస్మస్



క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న సర్పంచ్ ఏసమ్మ

దెందులూరు: స్థానిక ట్రూ లైట్ చర్చిలో పాస్టర్ ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్‌ను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా దెందులూరు సర్పంచ్ తోట ఏసమ్మ, బేతస్థ చర్చి పాస్టర్ పల్లి విశాల్ ఓబద్య హాజరై క్రిస్మస్ కేకును కట్ చేశారు. సంఘస్తులకు శుభాకాంక్షలు తెలిపారు. పాస్టర్ విశాల్ ఓబద్య క్రిస్మస్ సందేశమిస్తూ యేసయ్యను పరిశుద్ధత ప్రేమను కలిగి ఆరాధించాలన్నారు. మానవుల పాపాలను పరిరక్షించడానికి యేసయ్య భూమికి వచ్చారని వివరించారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన, సేవాభావం కలిగి జీవించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శేషారత్నం, పాస్టర్ బెంజిమెన్ చిన్న, మోషే, డేనియల్, చంద్రశేఖర్, సంఘస్తులు హాజరయ్యారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

దెందులూరు: మండలంలోని దెందులూరు, కొవ్వలి, వేగవరం చర్చిల్లో గురువారం హేలాపురి ఇంజినీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల డైరెక్టర్ అరసవిల్లి అరవింద్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు, దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ఫౌండర్ అరసవిల్లి అరవింద్ సేవలను
వేగవరం బాప్టిస్ట్ చర్చి పాస్టర్ రాజేష్ కొనియాడారు. అనంతరం ట్రస్ట్ సభ్యులు సంఘస్తులతో కలిసి సెమీ క్రిస్మస్‌లో పాల్గొన్నట్టు ట్రస్ట్ సభ్యులు ఆయుబ్ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

భీమడోలు: విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. గుండుగొలను జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం రూ.7.60 లక్షలతో నిర్మించిన 40 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. పాఠశాలలో 15 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ వల్ల లో ఓల్టేజ్ సమస్య, పరిసర ప్రాంతాల్లోని గృహాలకు తరచుగా విద్యుత్ అంతరాయం ఏర్పడుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే ధర్మరాజు సూచనల మేరకు ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటుచేశారు. విద్యుత్ సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యేకు ఉపాధ్యాయ బృందం, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, పెద్దలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భీమడోలు: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలై ఏలూరులోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి గురువారం మృతి చెందాడు. భీమడోలు ఎస్సై వై.సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం .. మన్యం జిల్లా పాలకొండ మండల నక్కపేటకు చెందిన గొర్లి రామకృష్ణ(50) తన మనవరాలిని చూసేందుకు తన బావమరిది నిడమర్రు మండలం అడవికొలనులోని కింబూరి కృష్ణతో కలిసి ఈనెల 10వ తేదీ రాత్రి ద్విచక్ర వాహనంపై భీమడోలు వస్తున్నారు. జాతీయ రహదారిపై భీమడోలు కనకదుర్గమ్మ ఆలయం వద్దకు వచ్చేసరికి వారి ద్విచక్ర వాహనాన్ని వ్యాను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వారిద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. రామకృష్ణ ఏలూరులోని ఆంధ్ర ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు ఎస్సై వై.సుధాకర్ కేసు దర్యాప్తు చేపట్టారు.

కోళ్ల వ్యర్థాల తరలింపుపై కేసు

భీమడోలు: కోళ్ల వ్యర్థాలను రవాణా చేస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పూళ్ల పంచాయతీ పరిధి ఎంఎంపురం గ్రామానికి చెందిన భలే సాంబశివరావు అనే ఆక్వా రైతు అనుమతులు లేకుండా పూళ్లలోని చికెన్ దుకాణాల నుంచి 100 కేజీల కోళ్ల మాంసపు వ్యర్థాలను సేకరించి, తన మోపెడ్ తన చేపల చెర్వు వద్దకు తీసుకుని వెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు. మోపెడ్, కోళ్ల వ్యర్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని ఎస్సై వై.సుధాకర్ తెలిపారు.

వ్యాయామ కళాశాలకు క్రీడా పరికరాలు

దెందులూరు: గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాలకు గురువారం రూ.5.70 లక్షల విలువైన క్రీడా పరికరాలను దాతలు అందజేశారని ప్రిన్సిపాల్ ఎస్ నత్తానియేలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా దాతలకు ఆయనతోపాటు కళాశాల అభివృద్ధి కమిటీ అభినందనలు తెలిపారు.

సమన్వయంతోనే గ్రామ సమగ్రాభివృద్ధి

- అభివృద్ధి ప్రణాళిక తయారీపై శిక్షణ
- హాజరైన 806 మంది సిబ్బంది
- నేటితో ముగియనున్న తరగతులు
- నిధుల మంజూరు కోరుతున్న సర్పంచ్‌లు

నిడమర్రు: గ్రామ పంచాయతీల స్థానికీకరణ - సుస్థిర అభివృద్ధి లక్ష్య సాధనలో భాగంగా రాష్ట్ర గ్రామ స్వరాజ్య అభియాన్ (ఆర్‌జీఎస్‌ఏ) నిధుల వినియోగంపై ఈనెల 12వ తేదీ నుంచి ఉంగుటూరు నియోజకవర్గం 4 మండలాల్లో ఏర్పాటుచేసిన శిక్షణా తరగతులు శుక్రవారంతో ముగియనున్నాయి. నిధులు సద్వినియోగం చేసుకునేందుకు, గ్రామ అభివృద్ధికి ఉత్తమ ప్రణాళిక రూపొందించుకునేలా శిక్షణ ఇస్తున్నారు. సకాలంలో నిధులు మంజూరు చేయకుండా నిధులు వినియోగంపై శిక్షణలు ఇవ్వడం వల్ల ఉపయోగం ఏమిటని గ్రామ సర్పంచ్‌లు ప్రశ్నిస్తున్నారు.

లక్ష్యం చేరుకునేలా..

సుస్థిరాభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో రూపొందించుకోనేలా శిక్షణ ఫ్రేమ్ వర్క్ ఉంది. కేంద్ర ప్రభుత్వం స్థానికీకరణ అనేది 2030 ఎజెండా సాధించడంలో, లక్ష్యాలను నిర్దేశించడం, అమలు, ఆయా లక్ష్యాల పురోగతిని కొలిసేలా శిక్షణలో అంశాలు ఉన్నాయి. కేంద్రం దీనిపై ఎస్‌డీజీ నాలెడ్జ్ హబ్ ప్రారంభించింది. ఇది ఒక సాఫ్ట్ పోర్టల్, ఫ్రేమ్ వర్క్‌లు, ఎస్‌డీజీ లింక్ బడ్జెలను కలిపి అందిస్తుంది. పంచాయతీ రాజ్ చట్టం ఆర్టికల్ 73, 74 ప్రకారం గ్రామ పంచాయతీ అభివృద్ధిలో ప్రజలను ఏ విధంగా భాగస్వామ్యం చేయాలో వివరిస్తున్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, సర్పంచ్‌లు, కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బందికి రెండు నుంచి మూడు స్పెల్స్‌లో ఒకో బ్యాచ్‌కు 2 రోజుల చొప్పున ఆయా మండల పరిషత్ కార్యాలయాల వద్ద శిక్షణ ఇస్తున్నారు. వీటికి ఆయా మండలాల ప్రత్యేక అధికారులు పరిశీలకులుగా, కోర్సు డైరెక్టర్లుగా ఎంపీడీఓలు వ్యవహరిస్తున్నారు. 29 శాఖలకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. సంక్షేమ పథకాల అమలు, నిధులు, స్థానిక వనరుల సద్వినియోగం, పేదరిక నిర్మూలన, గుడ్ హెల్త్, క్లారిటీ విద్య, పరిశుభ్రమైన నీరు, గ్రీన్ ఎనర్జీ వంటి అంశాలపై అవగాహన కల్పించారు.



శిక్షణకు హాజరైన గణపవరం మండల పంచాయతీ సిబ్బంది



శిక్షణ పొందిన వారికి ధ్రువీకరణ పత్రం అందిస్తున్న ఎంపీడీఓ బేబీ శ్రీలక్ష్మి

మండలం	గ్రామాలు	శిక్షణ పొందిన వారు
నిడమర్రు	16	162
ఉంగుటూరు	29	270
గణపవరం	25	240
భీమడోలు	13	134

క్షేత్రస్థాయిలో అమలైతేనే ఫలితాలు



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసే నిధులతో పాటు స్థానికంగా ఆదాయ వనరులను పెంచుకునేందుకు, వాటిని సద్వినియోగం చేసుకునేలా శిక్షణ ఇచ్చాం. హాజరైన వారికి డిజిటల్ విధానంలో ధ్రువీకరణ పత్రాలు అందించాం. శిక్షణ అంశాలు పంచాయతీ సిబ్బంది క్షేత్రస్థాయిలో అమలు చేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చు.

– ఆర్ బేబీ శ్రీలక్ష్మి, ఎంపీడీఓ, కోర్సు డైరెక్టర్

నిధులు విడుదల చేయాలి



15వ ఆర్థిక సంఘం నిధులు సకాలంలో నేరుగా పంచాయతీలకు మంజూరు చేస్తేనే ఇటువంటి శిక్షణల వల్ల ఫలితం ఉంటుంది. చిన్న పంచాయతీల్లో ఆదాయ వనరులు చాలా తక్కువ. వాటికి ఆర్థిక సంఘం నిధులు ఎక్కువగా కేటాయిస్తే గ్రామాలు అభివృద్ధి చెందుతాయి. అధికారుల సమన్వయంతో ప్రజల భాగస్వామ్యంతో ప్రణాళికలు రూపొందిచుకునేలా సూచనలు అందించారు. – **పుప్పాల మెహర్‌కుమార్, ఉపాధ్యక్షుడు, జిల్లా సర్పంచ్‌ల చాంబర్**

మల్బరీ తోటల పెంపకం లాభదాయకం



నడిపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వాణి

పెదవేగి : మల్బరీ తోటల పెంపకం లాభదాయకమని పట్టు పరిశ్రమ జిల్లా శాఖ ఉపసంచాలకులు బి.వాణి అన్నారు. గురువారం పెదవేగి మండలం నడిపల్లి గ్రామంలో పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో వాణి మాట్లాడారు. వ్యవసాయ అనుబంధ పంటల్లో ఒకటైన మల్బరీ తోటలు పెంపకం ద్వారా నికరమైన ఆదాయాన్ని తక్కువ రోజుల్లో పొందవచ్చని వివరించారు. కుటుంబ సభ్యుల ద్వారానే సాగు చేసుకుని పట్టుని తీసుకోవచ్చని, మార్కెట్ ధర, రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అనేక రకాల పారితోషికాలను ఇస్తుందని తెలిపారు. పట్టు పరిశ్రమ ద్వారా పెదవేగి మండలం వేగివాడ, కన్నాపురం దెందులూరు మండలం రామారావు గూడెంలలో రైతులు ప్రతి నెలా మంచి ఆదాయం పొందుతున్నారని విజయరాయి పట్టు పరిశ్రమ శాఖ అధికారి రంగారావు తెలిపారు. కార్యక్రమంలో రైతులు మట్టా ఏడుకొండలు, మద్దాల ఆనందరావు, మేక నారాయణరావు, మద్దాల డేవిడ్ రాజు, చిన్నల రాఘవేంద్రరావు, పెనుమనూరి పుల్లయ్య పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం



పుప్పాల గోపి



దొంతంశెట్టి సత్యనారాయణ



ఆల్తి శ్రీనివాస్



మారిశెట్టి అబ్బులు



కామిరెడ్డి నాని



తేరా ఆనంద్



గూడపాటి పవన్‌కుమార్

ఉంగుటూరు: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ అనుబంధ విభాగాల జిల్లా అధ్యక్షులను నియమిస్తూ గురువారం సాయంత్రం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు విడుదలయ్యాయి. పార్టీ పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడిగా కైకరం గ్రామానికి చెందిన పుప్పాల గోపి నియమితులయ్యారు. ఆయన్ని ఈ పదవి రెండోసారి వరించింది. వీవర్స్ విభాగం జిల్లా అధ్యక్షుడిగా ఉంగుటూరు మాజీ సర్పంచి దొంతంశెట్టి సత్యనారాయణ నియమితులయ్యారు. ఆయన గతంలో ఈ పదవిలో పనిచేశారు.

లీగల్ సెల్ కన్వీనర్‌గా శ్రీనివాస్

భీమడోలు: వైఎస్సార్ సీపీ ఉంగుటూరు నియోజకవర్గ లీగల్ సెల్ కన్వీనర్‌గా ప్రముఖ న్యాయవాది భీమడోలుకు చెందిన ఆల్తి శ్రీనివాస్ నియమితులయ్యారు. ఆయన ఇప్పటికే రెండు సార్లు లీగల్ సెల్ కన్వీనర్‌గా, మూడు సార్లు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా, స్పెషల్ ప్రాసిక్యూటర్‌గా పని చేశారు. పార్టీ ఆవిర్భావం నుంచి బలోపేతానికి కృషి చేస్తున్న తనకు సముచిత స్థానం లభించిందని ఆయన గురువారం రాత్రి తెలిపారు.

సాంస్కృతిక విభాగం అధ్యక్షుడిగా అబ్బులు

గణపవరం: వైఎస్సార్ సీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడిగా ముగ్గల్లకు చెందిన మారిశెట్టి వేణుగోపాల కృష్ణమూర్తి (అబ్బులు) నియమితులయ్యారు. ఆయన నాలుగేళ్లగా పార్టీ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడిగా పని చేశారు. ఆయన్ని మరో సారి ఈ పదవి వరించింది. ఈ సందర్భంగా అబ్బులు జగన్‌కు, మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు.

దెందులూరు నుంచి ముగ్గురికి పదవులు

దెందులూరు: వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులుగా దెందులూరు నియోజకవర్గం నుంచి ముగ్గురికి స్థానం లభించింది. యువజన విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడిగా కామిరెడ్డి నాని, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా తేరా ఆనంద్, ఐటీ విభాగం అధ్యక్షుడిగా గూడపాటి పవన్‌కుమార్ నియమితులయ్యారు.

సదస్సుల్లో భూ సమస్యలకు పరిష్కారం



ఉంగుటూరు సమస్య వింటున్న ఆర్డీఓ అంబరీష్

ఉంగుటూరు: రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలను పరిష్కరించుకోవాలని ఆర్డీఓ అచ్చుత అంబరీష్ అన్నారు. గురువారం ఉంగుటూరు పంచాయతీ కమ్యూనిటీ హాలులో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. రికార్డుల్లో పేర్ల మార్పు వెంటనే చేస్తామని, 22ఏ వంటి సమస్యల పరిష్కారానికి సమయం పడుతుందని చెప్పారు. తహసీల్దార్ పూర్ణచంద్ర ప్రసాదు, ప్రత్యేక అధికారి చంద్రశేఖర్, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, సర్పంచి బండారు సింధులు మాట్లాడారు. పట్టాదార్‌పాస్ పుస్తకాల మార్పు, అడంగల్, పట్టా సబ్ డివిజన్, పేరు మార్పు, మ్యుటేషన్ ఆన్‌లైన్, సర్వే, ఆన్‌లైన్‌కు ఒక దరఖాస్తు వచ్చినట్టు తెలిపారు.

పారదర్శకంగా భూముల రీ సర్వే

భీమడోలు: భూముల రీసర్వేను పారదర్శకంగా నిర్వహించాలని తహసీల్దార్ బి.రమాదేవి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం సూరప్పగూడెంలో చేపట్టనున్న భూముల రీ సర్వేపై రెవెన్యూ, సర్వే శాఖల సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ ఈ సర్వే వల్ల కలిగే ప్రయోజనాలకు రైతులకు వివరించాలని అన్నారు. సర్వేయర్ ధర్మారావు, ఆర్ఐ కిరణకుమారి, వీఆర్వోలు, వీఏఏ తదితరులు పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న రమణ

ఉంగుటూరు: సుస్థిరాభివృద్ధే లక్ష్యంగా ఉద్యోగులు పనిచేయాలని ఎస్ఐఆర్‌డీ రాష్ట్ర జాయింట్ డైరెక్టరు గుండవరపు రమణ అన్నారు. గురువారం ఉంగుటూరులో మూడో బ్యాచ్ శిక్షణ తరగతులకు ఆయన హాజరై మాట్లాడారు. పేదరికం నిర్మూలన, చిన్నపిల్లలతో స్నేహంతో మెలగటం, ఫ్రెండ్లీ ఉమన్, తదితర 9 అంశాలపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ రాజ్‌మనోజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, చేబ్రోలు కార్యదర్శి శిక్షకుడు శ్రీనివాసరావు తదితరులు మాట్లాడారు. ఏఎస్ఎంలు, వ్యవసాయ, అగ్రికల్చర్ సహాయకులు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

పల్లెల్లో జ్వరాల వణుకు

- క్షీణిస్తున్న పారిశుధ్యం
- విజృంభిస్తున్న దోమలు
- ఆసుపత్రుల పాలవుతున్న ప్రజలు

పెదవేగి : విష జ్వరాలు గ్రామీణులను వణికిస్తున్నాయి. చికున్‌గన్యా, టైఫాయిడ్, మలేరియా, డెంగీ వంటి జ్వరాలు ప్రజలను పట్టిపీడిస్తున్నాయి. ఇందుకు గ్రామాల్లో పారిశుధ్యం క్షీణించడమే ప్రధాన కారణంగా చెబుతున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సౌకర్యాలు సక్రమంగా లేకపోవడంతో జ్వరపీడితులు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. వైద్యం కోసం అధిక మొత్తంలో డబ్బు ఖర్చు చేయాల్సి వస్తుందని వారు వాపోతున్నారు.

కానరాని వైద్య సిబ్బంది

దెందులూరు నియోజకవర్గంలోని వంగూరు, బాపిరాజుగూడెం, కూచింపూడి, పెదవేగి, రామశింగవరం, వంగూరు లక్ష్మీపురం, వేగివాడ, బి.శింగవరం, రామారావుగూడెం, పోతునూరు, కొవ్వలి, ఉప్పుగూడెం, శ్రీరామవరం, పెదపాడు, అప్పనవీడు, వసంతవాడ, తదితర గ్రామాల్లో పారిశుధ్యం క్షీణించింది. దోమల బెడద ఎక్కువైంది. కచ్చాడ్రెయిన్లలో మురుగునీరు ముందుకు కదలడంలేదు. ఎక్కడికక్కడ చెత్తా చెదారం కుప్పలు కుప్పలుగా దర్శనమిస్తుంది. బ్లీచింగ్ పౌడర్, వేస్టాయిల్ వంటివి చల్లడం లేదు. ప్రతి నెలా 10వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఇంటింటికి తిరిగి ఆరోగ్య రక్షణపై అవగాహన కల్పించాల్సి ఉన్నా వైద్య సిబ్బంది జాడ కానరావడంలేదు. ఫలితంగా ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. రోజురోజుకు జ్వర పీడితుల సంఖ్య పెరుగుతోంది. జ్వర పీడితులు వైద్యం కోసం ఆసుపత్రుల వద్ద క్యూ కడుతున్నారు. ఇదే అదనుగా ప్రైవేటు వైద్యులు అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారని బాధితులు గగ్గోలు పెడుతున్నారు. గ్రామాల్లో సరైన వసతులు, వైద్య సేవలు అందుబాటులో ఉంటే తమకు ఈ పరిస్థితి వచ్చేంది కాదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం అభివృద్ధికి, వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



విజయరాయిలో స్వైరవిహారం చేస్తున్న పందులు



ఆసుపత్రిలో జ్వరంతో బాధపడుతున్న ఓ వ్యక్తి



కూచింపూడి దళితవాడలో నిలిచిన మురుగు

పారిశుద్ధ్యం అధ్వానం

గ్రామంలో పారిశుద్ధ్య పనులు సరిగ్గా చేయకపోవంతో మా పాపకు గత కొద్ది రోజుల క్రితం జ్వరం వచ్చింది. పల్లెటూరు కావడంతో సమీప వైద్యశాలో సరైన వైద్యం అందక, ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించుకున్నాం. అధిక మొత్తంలో డబ్బు ఖర్చుపెట్టాల్సి వచ్చింది.

– కె.మహేష్ కూచింపూడి గ్రామస్తుడు

వారం రోజులుగా జ్వరం

గత వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాను. గతంలో ఇంటింటికీ వచ్చి ఆరోగ్య సమస్యలపై ఆరా తీసేవారు. వైద్య సిబ్బంది ఇప్పుడు ఎవ్వరూ రావట్లేదు. ఇంట్లో వాళ్ల షాపు నుంచి తీసుకొచ్చిన మాత్రలు వేసుకున్నా జర్వం తగ్గలేదు. ఓపిక లేకున్నా ఆస్పత్రికి వెళ్లాను.

– దివ్య, దెందులూరు గ్రామ యువతి

వైద్య ఖర్చుల పరిమితిని పెంచాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ ద్వారా ఉపాధ్యాయ, ఉద్యోగులకు అందిస్తున్న వైద్య ఖర్చుల పరిమితి ప్రస్తుతం రూ.2 లక్షలు నుంచి రూ.10 లక్షలకు పెంచాలని పీఆర్‌టీయూ ఏలూరు జిల్లా నాయకులు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కోరారు. ఈ మేరకు గురువారం అమరావతిలో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఆ వివరాలను నాయకులు ఏలూరులో పత్రికలకు విడుదల చేశారు. ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు మెడికల్ రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి వైద్య ఖర్చుల బిల్లులు రూ.50 వేలు వరకే జిల్లా స్థాయిలో మంజూరు చేస్తున్నారని, రూ.50 వేలు దాటిన బిల్లులను రాష్ట్ర స్థాయికి పంపుతున్నారని, దీంతో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలోనే రూ.1 లక్ష వరకు బిల్లులు ఆమోదించేలా తగిన ఉత్తర్వులు ఇప్పించాలని కోరారు. ఈహెచ్ఎస్ ద్వారా రాష్ట్రంలో ఉన్న అన్ని గుర్తింపు ఆసుపత్రుల్లో అన్ని రకాల వ్యాధులకు ఉచితంగా వైద్యం అందేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. అన్నిరకాల వైద్య పరీక్షలతోపాటు మందులు కూడా ఉచితంగా ఇచ్చే ఏర్పాటు చేయాలని కోరారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ త్వరితగతిన మంజూరు ఉత్తర్వులతో పాటు సొమ్మును సంబంధిత ఎకౌంట్‌లో జమయ్యేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వల ఆంజనేయులు, నాయకులు పామర్తి ఏసురాజు, ఎం రాంబాబు, ఎస్‌డీ ముర్సలీన్ ఉన్నారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

దెందులూరు: మండలంలోని వేగవరం హేలాపురి ఇంజినీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో గురువారం 4 జట్లు మధ్య జేఎన్‌టీయూ కాకినాడ కళాశాలల బాలుర క్రికెట్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఆంధ్ర లయోలా ఇంజినీరింగ్ కాలేజీ జట్టు ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీ జట్టుపై విజయం సాధించింది. కిడ్స్ దివిలి జట్టు ఐడియల్ కాలేజీ జట్టుపై విజయం సాధించింది. విజేత జట్లను కళాశాల ప్రిన్సిపాల్ లావణ్య, ఏఓ కరుణానిధి, హెచ్ఓడీలు, లెక్చరర్లు అభినందించారు.

శిక్షణకు ముగ్గురు సూపర్‌వైజర్లు

దెందులూరు: రాష్ట్రీయ బాల స్వస్థ బాలల సంపూర్ణ ఆరోగ్య రక్ష శిక్షణకు మండలంలో ముగ్గురు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఏలూరు వెళ్లారు. విద్యాశాఖ ఐసీడీఎస్ బాల స్వస్థ విభాగాలు సంయుక్తంగా పాఠశాలలో ఎస్‌జీటీలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లకు మూడు రోజులపాటు శిక్షణ ఇస్తున్నారు. శనివారం శిక్షణ ముగియనుంది.

కార్మికుల బకాయిలు చెల్లించాలి



మాట్లాడుతున్న భజంత్రీ శ్రీనివాసరావు

ఏలూరు (టూటౌన్) : మున్సిపల్ కార్మికులకు బకాయిలు తక్షణమే చెల్లించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఏలూరు జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల ముఖ్య కార్యకర్తల సమావేశం స్థానిక స్ఫూర్తి భవనంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో యలగాడ దుర్గారావు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏలూరు కార్పొరేషన్ పరిధిలో మున్సిపల్ కార్మికులకు జనరల్, స్పెషల్ ఇంక్రిమెంట్లు, మెడికల్ లీవ్ బిల్లు బకాయిలు, పదవీ విరమణ పొందిన వారికి రావాల్సిన లీవ్ ఎన్ కాష్ మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఔట్ సోర్సింగ్ కార్మికుల ఫిబ్రవరి నెల హెల్త్ అలవెన్స్ బకాయిలు చెల్లించాలన్నారు. మున్సిపల్ కార్మికులకు బ్యాంకుల ద్వారా రుణ సౌకర్యం కల్పించాలని కోరారు. 2025 సంవత్సరానికి కార్మికుల యూనియన్ సభ్యత్వాలు సకాలంలో చెల్లించాలన్నారు. సీపీఐ శత వార్షికోత్సవ వేడుకల్లో కార్మికులు భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో యలగాడ శివకుమార్, బంగారు రాజు, కెంగం దుర్గారావు, కరపాటి నాగరాజు, కాకాని సుబ్బారావు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యంపై అవగాహన



కాగుపాడు పీహెచ్‌సీలో మాట్లాడుతున్న ఆయుర్వేద డాక్టర్ శిరీష

ఉంగుటూరు: మండలంలోని కాగుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద దేస్ కా పకృతి పరీక్షన్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఆయుర్వేద వైద్యంపై ఆయుర్వేద డాక్టర్ కె.శిరీష అవగాహన కల్పించారు. ఆయుర్వేదం ఉపయోగాలను వివరించారు. సమావేశంలో పీఎచ్‌సీ డాక్టర్ మానస, కమతం శ్రీనివాస్, ఆశ కార్యకర్తలు, మెటర్నరీ అసిస్టెంట్లు కృష్ణకుమారి, జయలక్ష్మి, దుర్గ, నాగరాజు పాల్గొన్నారు.